క్లుప్తంగా

నేడు బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవం


శ్రీభగవాన్ పెదబాలయోగీశ్వరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో నాలుగు దశాబ్దాల పాటు కఠోర తపస్సు ఆచరించి ముక్తి పొందిన శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో శనివారం తీర్థ మహోత్సవాలు జరుగనున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శన మండపంపై బాలయోగీశ్వరుల పరబ్రహ్మమూర్తి విగ్రహ దర్శనం, దివ్య సమాధుల దర్శనం ఉంటుంది. వేలాది మంది భక్తులు బాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో తపో ఆశ్రమాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేసిన సంక్షేమ సంఘ సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక బాలికల వసతి గృహంలో ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్‌లు, పెన్సిళ్లు, లాంగ్ స్కేల్, షార్ప్‌నర్ తదితర కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కాశి వెంకటాచార్య, జనిపెల్ల సత్యనారాయణ, కాశి జగ్జీవన్‌రామ్, ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల బాలకృష్ణ, నక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా రాఘవ



అమలాపురం టౌన్: ఆర్య వైశ్య సంఘాల్లో పలు పదవులు నిర్వహిస్తున్న అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త యెండూరి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు నాళం ఆండాలు నుంచి నియామక ఉత్తర్వులు రాఘవ శుక్రవారం అందుకున్నారు. ఆమె ప్రస్తుతం వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ వైస్ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల అమలాపురం వేదికగా ఆమె యెండూరి రాఘవ నాగేశ్వరరావు ఐ బ్యాంక్ అండ్ బ్లడ్ సెంటర్ స్థాపించి దానికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాఘవ తన భర్త యెండూరి నాగేశ్వరరావుతో కలసి పలు వితరణ కార్యక్రమాలు చేపట్టారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


తనుశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశరావు

యానాం: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో యానాం నవోదయ విద్యాలయ విద్యార్థిని ఎన్.తనుశ్రీ తృతీయ స్థానం సాధించిందని శుక్రవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 6 నుంచి 12వ తరగతి వరకూ విద్యార్థులకు ప్రజాస్వామ్య తత్వంపై జరిగిన వ్యాసరచన పోటీలో ఈ బహుమతి సాధించిందన్నారు. 'వసంతాల భారత గణతంత్ర విజయాలు' అనే అంశంపై ఆమె రాసిన వ్యాసం క్లస్టర్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి తర్వాత జాతీయ స్థాయికి ఎంపికై తృతీయ స్థానం సాధించిందన్నారు. తనుశ్రీకి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆమెకు సహకరించిన ఇంగ్లిషు టీచర్ విమల కుమారిని అభినందించారు.

రుణాల పంపిణీ

యానాం: పుదుచ్చేరి ఆదిద్రావిడ శాఖ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు మంజూరైన రుణాలను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పంపిణీ చేశారు. చిన్నపాటి వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఎంపిక చేసిన 15 మందికి మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఐదుగురికి రూ.లక్ష చొప్పు, పది మందికి రూ.50 వేల చొప్పున రుణాలు మంజూరయ్యాయన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

యానాం: ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబరర్స్‌ను రెగ్యులర్ చేయాలని కోరుతూ యూనియన్ నేతలు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామిని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006 నుంచి 30 మంది ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబరర్స్‌గా వివిధ శాఖల్లో చేస్తున్నామన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ ఈ సమస్యపై సోమవారం పుదుచ్చేరిలో ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు.


మురమళ్లలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు


మురమళ్లలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ చింతా అనురాధ


సుంకరపాలెం శివాలయంలో స్వామివారికి హారతి ఇచ్చి భక్తులకు చూపిస్తున్న అర్చకులు


మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల క్యూ


గోడిలో బాలయోగీశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

భవాయ.. భక్తవత్సలాయ

- అంతటా శివనామ స్మరణ
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్/ ముమ్మిడివరం/ అల్లవరం/ కాట్రేనికోన /ఉప్పలగుప్తం: శివాయ నమో నమః.. మహేశ్వరాయ నమః.. అంటూ ఆ సర్వేశ్వరుడిని కొలిస్తూ, మహా శివరాత్రి పర్వదినాన భక్తులు తన్మయత్వం చెందారు. శుక్రవారం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమలాపురంలోని సిద్ధేశ్వరస్వామి, చెన్న మల్లేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి, చంద్ర మౌళీశ్వరస్వామి, నాగ లింగేశ్వరస్వామి ఆలయాల్లో శివునికి పాలు, పెరుగు, తేనె, రకరకాల పండ్ల రసాలతో అభిషేకాలు జరిగాయి. మెయిన్ రోడ్డులోని సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద శివలింగాన్ని భక్తులు నేరుగా తాకి అభిషేకాలు చేసుకునే అవకాశం ఉండడంతో భారీ క్యూ నెలకొంది. చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్ కల్వకొలను బాబి, సర్వమంగళ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ అనువంశిక చైర్మన్ మాచిరాజు రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో రవణం వీధిలోని ఓం శాంతి భవనంలో ఏర్పాటు చేసిన శివరాత్రి మహోత్సవాలను మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఆ కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామగోపాల్, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్వకొలను ఛాయాదేవి, చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ముమ్మిడివరం ఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.
- సామంతకుర్రు శివారు ఎస్.రామేశ్వరంలో పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఎస్.రామేశ్వరం సముద్ర తీరానికి తరలివచ్చి సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం బాలాలయంలో కొలువైయున్న పార్వతీ సమేత రామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎంపీ చింతా అనురాధ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోడిలోని బాలయోగీశ్వర స్వామి వారిని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దర్శించుకున్నారు.

లక్ష్మణేశ్వరంలో ఆలయాన్ని, దేవగుప్తంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామి, కొమరగిరిపట్నంలో బాలాత్రిపుర సుందరి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో రద్దీ నెలకొంది. కుండలేశ్వరం ఆలయాన్ని మంత్రి పినిపే విశ్వరూప్ దర్శించుకున్నారు. బ్రహ్మ సమేధ్యం శివారు మగసానితిప్పలో కాలభైరవ స్వామిని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, నీరజ దంపతులు, కలెక్టర్ హిమాన్షు శుక్లా బోట్లపై వెళ్లి దర్శించుకున్నారు. ఉప్పలగుప్తం మండలం మునిపల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లవిల్లిలో నిత్యాన్నదాత పోలిశెట్టి భాస్కరరావు సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. విలసవిల్లిలో దీపాలంకరణ ఆకట్టుకుంది.

వీరేశ్వరా.. సర్వేశ్వరా..

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయాన్ని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. హిందూ ధర్మ పరిషత్, సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. హైస్కూల్ సెంటర్ వద్ద భక్తులకు అన్నసమారాధన చేశారు. ఉదయం 8 గంటల నుంచి అన్నమాచార్య కీర్తనలు, భజన కాలక్షేపం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి మధ్యాహ్నం 12 గంటలకు ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం చేశారు. స్వామివారికి గంగ, యమున, సరస్వతి, నర్మద, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరథి, పుష్కరణి, తుంగభద్ర, సింధు, ప్రణీత నదుల జలాలతో ఆలయ పండితులు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం చేశారు. తొలుత పుష్కర నదీ జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం శూలాల సంబరం, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్వామివారికి 375 పంచామృత అభిషేకాలు, 982 లఘున్యాస పూర్వక అభిషేకాలు, 1,042 పుష్కరనదీ జలాభిషేకాలు జరిగాయి. సాయంత్రం మేళతాళాలతో నందాదీప మహోత్సవం జరిగింది. స్వామివారిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ దర్శించుకున్నారు. అదేవిధంగా భైరవపాలెం, కేశనకుర్రు శివాలయాల్లో అభిషేకాలు చేశారు.

తాళ్లరేవు: చొల్లంగి రాజరాజేశ్వరి సహిత సోమేశ్వర స్వామివారి ఆలయం, తాళ్లరేవు, సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరాలయాలు, పిల్లంక, పటవలలో కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామివారి ఆలయాలు, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి ఆలయం, ఉప్పంగల రామలింగేశ్వరస్వామివారి ఆలయం, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో శోభాయమానంగా కనిపించింది. పాతకోరంగి కురంగేశ్వరస్వామి, కోరంగి వనదుర్గా సమేత విశ్వేశ్వరస్వామివారి, చొల్లంగి సంగమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

యానాం: యానాం పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో యర్రగుంటవారి వీధిలో భావనాఋషి ఆలయం వద్ద ఆదిమూలం కృష్ణ పర్యవేక్షణలో దీపాలంకరణ చేశారు. యానాం బ్రహ్మకుమారీస్ గీత పాఠశాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అమలాపురం రూరల్: బండారులంకలోని శివాలయాలు, రామాలయాల్లో వేడుకలు జరిగాయి. మట్టపర్తిపాలెంలో చిన్నారులు శివలింగానికి పూజలు చేశారు.


అమలాపురంలో ఓం శాంతి శివరాత్రి మహోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్


విలసవిల్లిలో దీపాలంకరణ చేసిన భక్తులు


ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం


గొల్లవిల్లిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


ఎస్.రామేశ్వరం వద్ద సముద్ర తీరంలో భక్తుల పుణ్యస్నానాలు


యానాం యర్రగుంట వారివీధిలో దీపాలంకరణ

పంటగలా వచ్చి.. సిరులు తెచ్చి

- వైఎస్సార్ రైతు భరోసాతో మేలు
- ముమ్మిడివరం సబ్ డివిజన్‌లో 30,545 మంది రైతులు
- రూ.98.73 కోట్ల ప్రయోజనం


ముమ్మిడివరంలో వరి చేను

ముమ్మిడివరం: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు మంచి రోజులొచ్చాయి.. గత టీడీపీ హయాంలో సాగు దండగ అనే రోజులు రాగా, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండగలా మార్చింది.. ఎన్నికల ముందు పుడమి పుత్రుల కష్టాలను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, సాగును బంగారం చేశారు.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం వరంలా మారింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో 30,545 మంది రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రూ.98.73 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ పథకం అర్హులందరికీ అందించి, రైతన్నలను ప్రభుత్వం ఆదుకుంటోంది. రాజకీయ పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకం వర్తింపజేశారు. రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు వర్తింపజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హ యాంలో వర్షాలు లేక పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. పెట్టుబడి కోసం ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అందించడంతో పాటు పంట రుణాలపై సున్నా వడ్డీ, వైఎస్సార్ క్రాఫ్ ఇన్సూరెన్స్, వైఎస్సార్ యంత్ర సేవా పథకాలతో రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంది.

నియోజకవర్గంలో..

మండలం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
ముమ్మిడివరం	8,829	28.08
ఐ.పోలవరం	7,481	24.52
కాట్రేనికోన	6,595	21.01
తాళ్లరేవు	7,640	25.12
మొత్తం	30,545	98.73

అర్హులందరికీ వర్తింపజేశాం..



అర్హత గల ప్రతి రైతుకూ వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తింపజేశాం. ప్రతి కుటుంబంలో అర్హత గల రైతులకు ఈ పథకం ప్రయోజనం కలిగింది. అర్హులైన భూ యజమానులకు, కౌలు రైతులకు రైతు భరోసా పథకం వరంలా మారింది. పెట్టుబడులకు కొండంత ఆసరా అయ్యింది.

– ఎస్.ప్రశాంతకుమార్ ఏఓ, ముమ్మిడివరం

పెట్టుబడికి భరోసా



రైతు భరోసా పథకం ఎంతో ఆసరాగా నిలిచింది. సాగు సమయంలో రైతు భరోసా పథకం ద్వారా వచ్చే నగదు కొంత వరకూ పెట్టుబడికి ఉపయోగపడింది. రైతుల కష్టాలను గుర్తించి భరోసా కల్పించడం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతోంది.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

సచివాలయాలతో పాలన చేరువ

మంత్రి పినిపే విశ్వరూప్


నడిపూడిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు పాలన చేరువైందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నడిపూడి గ్రామంలో నరేగా నిధులు రూ.38 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే రూ.23.94 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభించి, నడిపూడి డాబా గార్డెన్‌లో రూ.20 లక్షలతో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక గ్రామ సచివాలయ వ్యవస్థని, తద్వారా పరిపాలనలో సరికొత్త అధ్యాయం లిఖించారని అన్నారు. ఈ కార్యకలాపాల నిర్వహణకు నూతన భవనాలు అందుబాటులో తేవడం ఆనందదాయకమన్నారు. తాగునీటి వసతులు మెరుగుపరిచే దిశగా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను అందుబాటులో తెస్తున్నామన్నారు. తొలిత నల్లమిల్లిలో కేతావారిపాలెంలో వాటర్ ట్యాంకు, అప్పారివారిపాలెంలో రోడ్డు నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచులు చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, గోకరకొండ వాసు, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఏఎంసీ మాజీ చైర్మన్ చొక్కా ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, నాయకులు ఆరిగెల సుబ్బరాజు, రంకిరెడ్డి శ్రీనివాసరావు, రమణాతి పల్లయ్యశెట్టి, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ అందజేత

ఐ పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామివారి కల్యాణానికి విచ్చేసిన భక్తుడు పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్ తిరిగి దొరికింది. ఆ వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన దంపతులు స్వామివారి కల్యాణానికి విచ్చేశారు. భక్తుని చేతికి ఉన్న బ్రాస్‌లెట్ కనిపించకపోవడంతో ఆలయ అధికారులకు తెలియజేశారు. పూలు, పండ్ల దుకాణం వద్ద పోగొట్టుకున్నట్లు వారు నిర్ధారించారు. దుకాణ యజమానురాలు పోలిశెట్టి అనంతలక్ష్మి, శ్రీనివాస్‌లు నిజాయితీగా సుమారు రూ.70 వేల విలువచేసే బంగారు బ్రాస్‌లెట్‌ను బాధితులకు అప్పగించారు.

నిందితుల అరెస్ట్ కోరుతూ ర్యాలీ


కొవ్వొతుల ర్యాలీ చేస్తున్న యువత

యానాం: పుదుచ్చేరిలో బాలికపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి స్థానిక యానాం యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలో పలు వీధుల నుంచి సాగింది. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు కుడుపూడికి సత్కారం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను ఈ నెల 10న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్కరించనున్నట్లు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ తెలిపారు. సుంకరపాలెం జాతీయ రహదారిలోని కాపు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

రోడ్డెక్కిన మురుగు


సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లోని ద్రాక్షారామ రహదారిలో చేరిన మురుగు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్‌లో డ్రైనేజీ నీరు రహదారిపై పారుతోంది. హైవే నుంచి ద్రాక్షారామకు వెళ్లే రహదారిలో నిత్యం మురుగు నిలిచి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారి చెంతన డ్రైనేజీని నిర్మించారు. అయితే డ్రైనేజీ నిర్వహణ లేక చెత్తా చెదారాలు పెరిగిపోయి నీరు పారని పరిస్థితి నెలకొంది. అక్కడ తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా నీరు నిలిచిపోవడంతో అనేకమంది జారిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

అతివలకే అన్నింటా అగ్రాసనం


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గీత తదితరులు



అమలాపురంలో అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత వందనను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు


ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహిళల వేడుకలు


యానాంలో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

- ఘనంగా మహిళా దినోత్సవం
- ఊరూవాడా సంబరాలు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అతివలకు అన్నింటా అగ్రాసనం కల్పించారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి గీత అన్నారు. శుక్రవారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో గీత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సర్పంచ్ సునీత, పురపాలక మాతా శిశు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుడుపూడి విజయ, మహిళా న్యాయవాదులు, వైద్యులు, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ పాల్గొన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో గడియారం స్తంభం సెంటర్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇటీవల మలేషియాలో జరిగిన ఏషియాడ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రంలో తొలిసారిగా పతకాన్ని సాధించిన పట్టణానికి చెందిన పి.వందనను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, అమలాపురం క్లబ్ కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు, పచ్చిగోళ్ల రాజా పాల్గొన్నారు.

- మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అమలాపురం కోర్టుల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వి.గౌరీశంకరరావు సూచించారు. స్థానిక కిమ్స్ మెడికల్ కాలేజీలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మట్లాడారు. ప్యానల్ లాయర్లు కేవీవీ శ్రీనివాసరావు, వల్రే సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి డీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ మహిళల హక్కులు– చట్టాల గురించి వివరించారు.

ముమ్మిడివరం: మహిళల సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి అన్నారు. ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పెయ్యల భూలక్ష్మి, ఐ.పోలవరం ఎంపీపీ మేరిమిరియాం జ్యోతి, పోతుల రత్నకుమారి, టి.శాంతి సుధ, వరసాల రమాదేవి పాల్గొన్నారు. అయినాపురంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ గౌరవాధ్యక్షుడు టి.నాగరాజారావు అధ్యక్షతన వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబంలో మహిళలే కీలకం

యానాం: కుటుంబ అభివృద్ధిలో మహిళదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో యానాం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఇటీవల పుదుచ్చేరిలో బాలికపై సామూహిక అత్యాచారం చేసి మురుగుకాల్వలో పడేసిన ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఎమ్మెల్యే అన్నారు. అంగన్‌వాడీ టీచర్ చింతా మంగాయమ్మను సత్కరించారు. ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ పాల్గొన్నారు. స్థానిక ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ అకౌంట్స్ వినకోటి ఉషారాణిని సత్కరించారు. నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అధ్యక్షతన, అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు సతీమణి బదరీ లక్ష్మితో కలసి కేక్ కట్ చేశారు. మహిళలందరికీ కిమ్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్ గుర్తింపు పరీక్షలపై వారం రోజుల పాటు 90 శాతం ప్రత్యేక రాయితీని చైర్మన్ చైతన్యరాజు ప్రకటించారు. కిమ్స్ ఎండీ రవికిరణ్‌వర్మ, జీఎండీ శేష పవిత్ర, కిమ్స్ డీన్ ఆనంద్ ఆచార్య, డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.